క్లుప్తంగా

విత్తనాల కొనుగోలులో రైతులు



విత్తనాల దుకాణంలో మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

పాములపాడు: వర్షాలు కురవడంతో రైతులు సంతోషానికి అవధులు లేవు. మృగశిర కార్తీ ఆరంభం కావడంతో వాతావరణం చల్లబడింది. మండలంలో కురిసిన వర్షాల వల్ల పొలాలు అదును అయ్యాయి. దీంతో రైతన్నలు శనివారం విత్తనాల కొనుగోలుకు విత్తన దుకాణాల వద్ద గుమి కూడుతున్నారు. ఏ రకం విత్తనం నాటితే అధిక దిగుబడి వస్తుందని ఒకరికొకరు సమాలోచనలు చేసుకుంటూ విత్తనాలు కొంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు పొలాల్లో బిజీగా మారారు.

కూలిన ఇంటి గోడ



కూలిన గోడ

పాములపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రాజశేఖర్ అనే వ్యక్తికి చెందిన ఇంటి గోడ శనివారం కూలింది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గోడ కూలడంతో నిత్యావసర సరుకులు, సామగ్రి దెబ్బతినిందని బాధితుడు రాజశేఖర్ వాపోయారు. నివాస గృహమైనందున ప్రస్తుతం టార్పాలిన్ పట్టను రక్షణగా కట్టుకున్నామని పేర్కొన్నారు.

దేవస్థానం ఉద్యోగి మృతి



మండ్ల కోటయ్య

శ్రీశైలం : శ్రీశైల దేవస్థానంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.కోటయ్య (61) శుక్రవారం రాత్రి అనారోగ్య కారణాలతో శుక్రవారం రాత్రి మరణించారు. వారి బంధువులు చెప్పిన వివరాల మేరకు శుక్రవారం రాత్రి ఆరోగ్యం క్షీణించడంతో వెంటనే హైదరాబాదుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తీవ్ర గుండెపోటు రావడంతో మృతి చెందారు. 1938లో శ్రీశైల దేవస్థానంలో తోటమాలిగా చేరిన ఆయన 2021లో రికార్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కోటయ్య మరణ వార్త వినగానే శనివారం ఉదయం దేవస్థానం ఉద్యోగులు, వారి బంధుమిత్రులు శ్రీశైలంలోని వారి ఇంటికి చేరుకుని కోటయ్యకు నివాళులర్పించారు.

కమనీయం.. మహానందీశుడి కల్యాణం



వధూవరులుగా స్వామి, అమ్మవార్లు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు శనివారం కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతశర్మ, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, అర్చకులు స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగల్య ధారణ, అక్షతల సమర్పణ పూజలు కనుల పండువగా సాగాయి. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల్లో పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ సిబ్బంది, వాటర్ మెన్‌లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో కాలనీల్లో డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. కాలనీల్లో ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని జేసీబీతో డ్రైనేజీ ఏర్పాటు చేసి తొలగించినట్లు తెలిపారు.



మిడుతూరు నుంచి కర్నూలు వైపు వెళ్లే దారిలో కోతకు గురైన రోడ్డు



భారీ వర్షాలు.. నేల కోతలు

- వర్షపు నీటి ప్రవాహానికి కోతకు గురైన రహదారులు, పంట పొలాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు .. తీవ్రంగా నష్టపోయిన రైతులు
- రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం

మిడుతూరు: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేల కోతకు గురైంది. పంటపొలాలతో పాటు ప్రధాన రహదారులు కోతకు గురికావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి కోతకు గురైన చోట ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోతకు గురైన ప్రధాన రహదారి

నందికొట్కూరు నుంచి నంద్యాల వెళ్లే రహదారిలో కాకిలేరు వాగు ఉధృతి కారణంగా మండల కేంద్రమైన మిడుతూరు సమీపంలోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద రహదారి కోతకు గురైంది. అదేవిధంగా మండలకేంద్రమైన మిడుతూరు నుంచి ఓర్వకల్లు వెళ్లే రహదారిలో ఎస్సీ కాలనీ సమీపంలో, పీరుసాహెబ్ పేట - కడుమూరు గ్రామాల మధ్య నాపరాతి గనుల వద్ద రహదారి కోతకు గురై ఛిద్రం కావడంతో అటువైపుగా ప్రయాణించే వాహనాల చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు గుర్తించక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రహదారి వెంట కోతకు గురైన ప్రదేశంలో అధికారులు స్పందించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి, ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొట్టుకుపోయిన పొలాల కత్వలు

ఆయా గ్రామాల పరిధిలో పంట పొలాలకు ఏర్పాటు చేసిన రాతి కత్వలు సైతం వర్షపు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి భూమి కోతకు గురికావడంతో నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటికి మరమ్మతు చేయించాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుందని వాపోతున్నారు. పొలాల వద్ద కోతకు గురైన భూములను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా రాతి కత్వలను ఏర్పాటు చేయడంతోపాటు పంట పొలాలకు వెళ్లే రహదారులను బాగు చేసేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నాగలూటి సమీపంలో కోతకు గురైన పొలం



మిడుతూరు వద్ద కోతకు గురైన పొలం

మట్టి కత్వల ఏర్పాటుకు చర్యలు



మండలంలోని రైతుల పొలాలు వర్షం ధాటికి కోతకు గురయ్యాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాతి కత్వలు కట్టేందుకు వీలులేనందున మట్టి కత్వలు కట్టేందుకు చర్యలు తీసుకుంటాం. మట్టి కత్వలు నిలబడని చోట కొంత మేర రాతి కత్వలు కట్టేందుకు మాత్రమే వీలౌతుంది. రైతులు మట్టి కత్వలు కట్టేందుకు ముందుకు వస్తే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నీరు ఎక్కువగా నిల్వ ఉన్న ప్రదేశంలో ఫారంపాండ్ ఏర్పాటు చేస్తాం. -జయంతి, వైకేపీ ఏపీఓ

ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలి



ఇటీవల కురిసిన వర్షానికి మండల కేంద్రమైన మిడుతూరు నుంచి నంద్యాల, ఓర్వకల్లు, కర్నూలు వైపు వెళ్లే రహదారుల వెంట అక్కడక్కడా వర్షపు నీటి ధాటికి రహదారులు కోతకు గురయ్యాయి. రాత్రి సమయంలో వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదాల నివారణ కోసం హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలి. అదే విధంగా కోతకు గురైన ప్రదేశంలో మరమ్మతులు చేపట్టాలి.

– బోయ శ్రీనివాసులు, వాహన చోదకుడు, పీరుసాహెబ్ పేట

పొలాలు కోతకు గురయ్యాయి



ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వర్షాలు బాగా కురిశాయి. ఓ వైపు ఆనందంగా ఉన్నప్పటికీ వర్షం ధాటికి పొలాలు కోతకు గురికావడం, రాతి కత్వలు కొట్టుకపోడం జరిగింది. దీంతో సారవంతమైన మట్టి కొట్టుకుపోయి నిస్సారంగా తయారయ్యాయి. మళ్లీ రాతి కత్వలు ఏర్పాటు చేసుకోవాలంటే ఖర్చుతో కూడుకున్నది. అధికారులు కోతకు గురైన భూములు గుర్తించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాతి కత్వల పనులను చేపట్టడంతో పాటు పొలాలకు వెళ్లే రహదారులను బాగు చేయాలని కోరుతున్నాం.

-ఘొలకసీమ ధర్మారెడ్డి, మిడుతూరు, రైతు

పాఠ్యపుస్తకాల మంజూరు

కొత్తపల్లి: 2024-25 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు మంజూరు అయ్యాయని మండల విద్యాధికారి-2 ఇనాయతుల్లా శనివారం తెలిపారు. మండలంలో 42 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వీటికి సంబంధించి ఈ విద్యాసంవత్సరానికి గాను 1, 2 తరగతులకు గాను 3,000 పాఠ్యపుస్తకాలు, 3, 4, 5, 6, 7 తరగతులకు గాను మొదటి విడతలో 900 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. 8వ తరగతి 28,179, 9వ తరగతికి 4,082, 10వ తరగతికి 3,575 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయని చెప్పారు. 1 నుంచి 10వ తరగతి వరకు నోట్‌బుక్స్ మొత్తం 16,746 వచ్చాయని వివరించారు. వీటితోపాటు 3,300 బెల్టులు మండల కేంద్రానికి చేరుకున్నాయన్నారు. మరోవిడత పుస్తకాలు పాఠశాలల ప్రారంభ సమయానికి వస్తాయని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాక అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

హామీల అమలుకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నందికొట్కూరు: అధికారం కోసం ఎన్డీఏ నేతలు అనేక వాగ్దానాలు ఇచ్చారని, వాటి అమలు కోసం ప్రజల పక్షాన సీపీఎం ఉద్యమిస్తుందని జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు తెలిపారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికార పీఠం కోసం అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చిందన్నారు. వాగ్దానాల అమలు కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, బెస్తరాజు తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడులో భారీ వర్షం



వెలుగోడులో వర్షం కురుస్తున్న దృశ్యం

వెలుగోడు: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. పలు ఇళ్లు, దుకాణాల్లోకి వరద నీరు ప్రవహించింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం సాగుకు అనుకూలంగా ఉండటంతో పొలం పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతున్నారు.

మానవత్వంతో మెలగాలి

జూపాడుబంగ్లా: ప్రతి వ్యక్తిలో పరమాత్మ ఉన్నాడనే భావనతో తోటివారి ఎడల మానవత్వంతో మెలగాలని తిరుమల-తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లువెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో హిందూధర్మ ప్రచార పరిషత్ అధ్వర్యంలో గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధార్మిక సిద్ధాంతాలు, భావాలను అలవర్చుకొని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. హిందూధర్మ కట్టుబాట్లకు లోబడి నిత్యం గోపూజతో పాటు దేవతామూర్తులకు దూపదీపారాధన చేయడం, ప్రాణుల ఎడల భూతదయ, మానవత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గోమాతకు పూజలు నిర్వహించి శ్రీవేంకటేశ్వరస్వామివారికి సామూహిక కుంకుమార్చన తదితర విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, అర్చకులు మనోహర్, చరణ్‌సాయి, బి.రవికుమార్, పుల్లయ్యగౌడు, శ్రీనివాసులు, దర్గయ్య, నీలకంఠమాచారి, వెంకటేష్, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న 80బన్నూరు గ్రామస్తులు

మహానంది దేవస్థానానికి ఏసీ విరాళం



ఏసీ విరాళం అందించిన దాతలతో ఈఓ, పండితులు



బియ్యం బస్తాలిచ్చిన శరభారెడ్డి దంపతులకు బాండు అందజేస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహానంది దేవస్థానానికి కడప నగరానికి చెందిన ఎన్ఆర్ఐ సునీల్, వెంకటలక్ష్మమ్మ, జయంత్, దినేష్‌కుమార్‌లు సుమారు రూ. 50వేల విలువైన ఎయిర్ కండీషనర్‌ను విరాళంగా అందించారు. శనివారం వారు దేవస్థానానికి చేరుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డికి వాటిని అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మలు దాతలను అభినందించారు.

ఆకలి తీర్చడం ఎంతో పుణ్యఫలం

మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తుల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యఫలమని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ కార్యక్రమానికి అబ్బీపురం గ్రామానికి చెందిన శవ్వా శరభారెడ్డి, శవ్వా మనోహర్‌రెడ్డి సోదరులు శనివారం పది టిక్కీల బియ్యం విరాళంగా అందించారు. ఈ మేరకు శవ్వా శరభారెడ్డి, సర్పంచ్ శ్రీలక్ష్మీ దంపతులను ఈఓ సన్మానించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

మహానందిలో వర్షం

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీలి రంగులో తెల్లటి మేఘాలతో కనువిందు చేసిన ఆకాశంలో ఒక్కసారిగా మబ్బులు కమ్మాయి. వరుణుడి రాకతో వాతావరణం చల్లబడింది. దీంతో వర్షం కురవగా మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో రోడ్డుపై గుంతలు ఉండటంతో వర్షపు నీరు నిలిచి భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మహానంది వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

దుర్గా భోగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల సమీపాన ఎర్రమల కొండలలో వెలసిన భోగేశ్వరం ఆలయంలో శనివారం ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో అర్చకులు శ్యామ్ సుందర్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. రుద్ర హోమం, రుద్ర పారాయణాలు, పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఆశీర్వాదం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో సరైన వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం కోరారు. శనివారం సున్నిపెంటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నచిన్న రోగాలకే ట్రీట్‌మెంట్ అందిస్తున్నారని, కొన్ని రోగాలకు చికిత్స చేసే అవకాశం ఉన్నప్పటికీ ఇతర ప్రాంత ఆసుపత్రులకు రెఫర్ చేయడం పరిపాటిగా మారిందన్నారు. మందులు కూడా అంతంత మాత్రమే ఆసుపత్రిలో ఉన్నాయని, రోగులు బయట కొనుక్కోవాలని డాక్టర్లు సూచిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆసుపత్రిని సందర్శించి, వైద్య సదుపాయాలు, సౌకర్యాలను పరిశీలించి మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సహకార సొసైటీ చైర్మన్ రాజీనామా



రాజీనామా చేస్తున్న నాగతులసిరెడ్డి

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరులోని పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ నాగతులసి రెడ్డి శనివారం రాజీనామా చేశారు. ఆయన మాట్లాడుతూ ఏపీ కాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకొని రైతులకు తనవంతు సేవ చేశానన్నారు. వ్యక్తి గత కారణాల వల్ల సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా సమర్పిస్తున్నట్లు వెల్లడించారు. సహకరించిన రైతులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



మహానందికి వచ్చిన డీఆర్ఓ మధుసూదన్‌రావు దంపతులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు దంపతులు శనివారం రాత్రి పూజలు నిర్వహించుకున్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

కౌలురైతు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి



కృష్ణారెడ్డి, ఏఓ, జూపాడుబంగ్లా

జూపాడుబంగ్లా: కౌలు రైతులు కౌలురైతు గుర్తింపు కార్డుల కోసం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొంత పొలం లేకుండా పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్న రైతులందరూ కౌలురైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఐదు ఎకరాల్లోపు సొంత భూమి ఉండి ఇతర రైతుల వద్ద మరింత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయ చేసే సన్న, చిన్నకారు రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కౌలు రైతులు భూమి యజమాని ధ్రువీకరణతో దరఖాస్తును ఆర్బీకేల్లో అందజేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు భూమి యజమాని, కౌలు రైతు ఆధార్‌కార్డు జిరాక్సులు, పొలం పట్టాపాసుపుస్తకం జిరాక్సు, కౌలు రైతు పాసుఫొటో జత చేయాలన్నారు. కౌలు రైతు గుర్తింపుకార్డు వల్ల పండించిన పంటను ప్రభుత్వ మద్దతు ధరతో ప్రభుత్వానికి విక్రయించుకోవచ్చని, రాయితీ విత్తనాలు, ఎరువులు పొందవచ్చని తెలిపారు. అలాగే పంట నష్టపరిహారం, రైతుభరోసా పెట్టుబడి సాయం, పంటల బీమా తదితర ప్రయోజనాలుంటాయని వివరించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇచ్చే కౌలు రైతు గుర్తింపు కార్డులు కేవలం 11నెలలు మాత్రమే చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేశారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ



మల్యాల వద్ద పొలంలో విత్తనాలు వేస్తున్న రైతులు



వర్షం రాకతో పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతున్న అన్నదాత

నందికొట్కూరు రూరల్ : మండలంలో కొద్ది రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు తమ పంట పొలాల్లో విత్తనాలు విత్తడానికి పొలం దున్ని సిద్ధం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులు మొక్కజొన్న, పత్తి, మినుము విత్తనం పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. గతేడాది వర్షాలు సరిగా లేకపోవడంతో విత్తన సాగు బాగా తగ్గింది. ప్రస్తుతం వర్షాలు సకాలంలో కురుస్తున్నందున రైతులు విత్తన సాగురై ఆసక్తి చూపుతున్నారు.

ఆలయాల్లో ఆరుద్రోత్సవ పూజలు

మహానంది: మహానంది, ఓంకారం ఆలయాల్లో శనివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి, ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు వేలాది సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు నిర్వహించుకున్నారు. శనివారం వీకెండ్ కావ డంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చారు.

వేలాలు వాయిదా

మహానంది: బండిఆత్మకూరులోని శ్రీ లక్ష్మీ, జనార్దన, ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆలయ భూములకు నిర్వహించాల్సిన వేలాలు వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ నాగప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 10న భోజనం, నారాయణపురం, పార్నపల్లె గ్రామాల్లో జరగాల్సిన వేలాలు సైతం వాయిదా వేశామన్నారు. కాగా,వేలాల నిర్వహణకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని రైతులు చర్చించుకున్నారు.